క్లుప్తంగా

హిందువుల మనోభావాలను కించపర్చడం తగదు



స్థానిక శాంతినగర్‌లోని నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

ఏలూరు (టూటౌన్) : హిందువుల మనోభావాలను కించపర్చేవిధంగా, హిందువుల సంస్కృతి, సంప్రదాయాలను విమర్శించడం తగదని బీజేపీ పశ్చిమ మండల కన్వీనర్ నడపన దాన భాస్కరరావు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ఆదివారం ఈ మేరకు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు వాళ్ల ఓటు బ్యాంక్ కోసం హిందువుల మనోభావాలను కించపర్చడం సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ముద్దాని జ్యోతి కుమార్, మేకల శ్రీకృష్ణ దేవరాయలు, కస్తూరి అనురాధ, ఇట్టాల కృష్ణారావు, చేకూరి గణపతి, ఇబ్బ వెంకటరావు, బంగారయ్య, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన హాస్యవల్లరి



మోతే శ్రీనివాస నారాయణరావు దంపతులను సత్కరిస్తున్న హాసం క్లబ్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరానికి చెందిన హాసం క్లబ్ ప్రతి నెలా మూడవ ఆదివారం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన హాస్య వల్లరి కార్యక్రమాలు ఆద్యంతం అలరించాయి. ఈ కార్యక్రమంలో పలువురు సభ్యులు హాస్య చతురతతో కూడిన వ్యాఖ్యానాలు చేశారు. మరి కొందరు సభ్యులు జోకులు చెప్పి సభికులను నవ్వుల్లో ముంచెత్తారు. ఈ సందర్భంగా కొందరు సభ్యులు అలనాటి సినీ గీతాలను శ్రావ్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం క్లబ్ సీనియర్ సభ్యులు మోతే శ్రీనివాస నారాయణ రావు, త్రిపుర సుందరి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పల్లా గంగాధర చయనులు, డాక్టర్ కె.కృష్ణమూర్తి, బి.విజయ సారధి, ఎస్.బాబి, హెచ్ శ్రీహరికోటి, ఎ. మహీధర్, గురు శర్మ, ఎస్.చంద్ర, ఎం.బెనర్జీ తదితరులు పాల్గొన్నారు. హాసం క్లబ్ అధ్యక్షుడు జీఎస్‌ఆర్ శర్మ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

అభ్యర్థులకు అండగా..

ఏలూరు టౌన్ : ఏలూరు నగరం, పరిసర ప్రాంతాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్‌ఐ) పోస్టులకు ఆదివారం నిర్వహించిన పరీక్షలు జరిగాయి. 14 పరీక్షా కేంద్రాల్లో 9014 మంది అభ్యర్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 7823 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ పర్యవేక్షణలో పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఏలూరు రేంజ్ ఐజీ జీ.పాలరాజు పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎస్సై పోస్టులకు పరీక్షలు రాసేందుకు ఏలూరు వచ్చిన అభ్యర్థులకు పోలీసులు అండగా నిలిచి సేవలు అందించారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు సకాలంలో చేరేలా పోలీస్ యంత్రాంగం తమవంతు కీలకపాత్ర పోషించారు.



ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ పరీక్షా కేంద్రంలో అభ్యర్థి ప్రశ్నాపత్రాన్ని పరిశీలిస్తోన్న ఏలూరు రేంజ్ ఐజీ పాలరాజు, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

సమయానికి గమ్యస్థానానికి చేర్చి



డీఎస్పీ పైడేశ్వరరావు తన వాహనంలో అభ్యర్థినిని పరీక్షా కేంద్రం వద్దకు తీసుకువచ్చిన దృశ్యం

ఒక అభ్యర్థిని ఏలూరు కొత్తబస్టాండ్ సమీపంలోని సీఆర్‌ఆర్ అటానమస్ కాలేజీలో పరీక్ష రాయాల్సి ఉండగా ఆమె వట్లూరులోని సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కాలేజీ పరీక్షా కేంద్రం వద్దకు వెళ్లింది. ఆమెకు కేవలం ఐదు నిమిషాలు మాత్రమే సమయం ఉండగా, తాను పరీక్ష రాయాల్సింది ఇక్కడ కాదని గుర్తించింది. తన కల నెరవేరకుండా పోతుందనే ఆందోళనతో తీవ్ర నిరాశలోకి వెళ్లిపోతున్న తరుణంలో ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు స్పందించారు. నాలుగు కిలోమీటర్ల దూరాన్ని నాలుగు నిమిషాల్లోనే అధిగమించి ఆమెను తన కారులో అటానమస్ కాలేజీ పరీక్షా కేంద్రానికి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె హాల్‌టిక్కెట్ నంబర్‌ను సీఐ ఆదిప్రసాద్‌కు చెప్పటంతో ఏ రూమ్‌కు వెళ్లాలో అన్ని సిద్ధం చేసి ఉంచారు. కారు దిగిన వెంటనే ఆమెను పరీక్ష గదికి చేర్చటంతో ఉత్కంఠకు తెరపడింది.

స్పృహ తప్పితే.. వైద్యం అందించి



అనారోగ్యంతో ఇబ్బంది పడిన అభ్యర్థి నాగలక్ష్మికి వైద్యసేవలు అందిస్తోన్న సీసీఎస్ సీఐ మురళీకృష్ణ

ఏలూరు నగరంలో ఎస్సై పరీక్ష రాసేందుకు చింతలపూడి పట్టణానికి చెందిన బేతం నాగలక్ష్మి నగరానికి వచ్చింది. ఏలూరు శనివారపుపేట రోడ్డులోని సెయింట్ ఆన్స్ మహిళా డిగ్రీ కాలేజీ పరీక్షా కేంద్రంలో ఆమె ప్రిలిమినరీ పరీక్ష రాయాల్సి ఉంది. ఎలాగైనా పరీక్షలో ఉత్తీర్ణత సాధించాలనే తపనతో పరీక్ష రాస్తోన్న నాగలక్ష్మి ఒత్తిడికి లోనై కళ్లు తిరగటం, వాంతులతో అనారోగ్యానికి గురైంది. పరీక్ష రాస్తూనే పడిపోయిన నాగలక్ష్మిని పరిస్థితిని చూసిన ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ, పరీక్ష ఛీఫ్ సూపరింటెండెంట్ సీహెచ్ పద్మజ తక్షణమే స్పందించారు. ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుటపడే వరకూ ఆమెకు వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి నృత్యాలు



కూచిపూడి నృత్యాలు ప్రదర్శిస్తున్న చిన్నారులు



క్విజ్ పోటీల్లో గెలుపొంది బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరానికి చెందిన శ్రీ రామ కోటి విశ్వశాంతి సమాజం ఆధ్వర్యంలో జరుగుతున్న 91వ శ్రీరామకోటి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు భారతం, రామాయణం అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించారు. ప్రత్యేక పూజలు అనంతరం ఉదయం 7 గంటల నుంచి విశ్వశాంతి సమాజం సభ్యులు మౌనధ్యానం, భక్తిగీతాలపనలు, హరేరామ సంకీర్తనలు చేశారు. అనంతరం స్వామి వారికి సహస్రనామ పూజలు, నిత్య హోమం చేసి స్వామి వారి నిత్య కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అనంతరం నిర్వహించిన క్విజ్ పోటీల్లో నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో ఎల్‌బీసీ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలువగా, శ్రీకృష్ణదేవరాయ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. వీరితో పాటు ఎల్‌బీసీ మెయిన్ క్యాంపస్ విద్యార్థులు తృతీయ స్థానంలో, అశోక్ నగర్ భాష్యం స్కూల్ విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు గెలుచుకున్నారు. ఈ పోటీలకు అనగాని శ్రీరామచంద్రమూర్తి క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. సాయంత్రం 7 గంటల నుంచి నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ ఆధ్వర్యంలో నాట్యాచార్య దువ్వి హేమ సుందర్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు భక్తులను విశేషంగా అలరించాయి. తొలుత అర్చక స్వాములు దివాకరుని వెంకటేశ్వర్లు, తుమ్మలపల్లి కాశీ విశ్వేశ్వర శర్మ విశేష పూజలు నిర్వహించగా శ్రీరామకోటి విశ్వశాంతి సమాజం అధ్యక్షుడు గాదంశెట్టి రమేష్ కార్యక్రమాలు పర్యవేక్షించారు.

146 మందికి కంటి పరీక్షలు



ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : నగరానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక రామకోటి ప్రాంగణంలోని ప్రార్థనా గాన సంఘ భవనంలో వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్ర వైద్యశాలకు చెందిన వైద్యులు, ఉషా గ్రూప్ సంస్థల అధినేత వీవీ బాలకృష్ణారావు సహకారంతో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 146 మంది పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 17 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి, వారి శస్త్ర చికిత్సకు ఏర్పాటు చేశారు. మరో 33 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మారం హనుమంతరావు, వేమా హరినారాయణ, వేమా రామచంద్రరావు, పసుమర్తి రమేష్, చెన్న వెంకట రామయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



ఏపీటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు కోరారు. ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఏలూరు జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక సంఘ జిల్లా కార్యాలయంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు బి.రెడ్డిదొర అధ్యక్షతన నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు చెల్లించాలని, ప్రస్తుత పీఆర్‌సీలోని అసంగతాలను తొలగించాలని కోరారు. దీనితో పాటు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను వెంటనే మంజూరు చేయాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించాలని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే రంగావలి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దాసోహమంటున్న కేంద్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు సీహెచ్ రామారావు

ఏలూరు (టూటౌన్) : బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్, ప్రైవేట్ సంస్థలకు అప్పగించి వారికి దాసోహమంటోందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహణ అధ్యక్షుడు చలసాని రామారావు ఆరోపించారు. స్థానిక స్ఫూర్తి భవన్లో ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనింగ్ కమిటీ సమావేశం కె.కృష్ణమాచార్యులు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామారావు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 8 ఏళ్లుగా కార్మిక హక్కులను హరిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరిస్తూ దేశ అభివృద్ధిని కుంటు పరుస్తోందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన కేంద్ర కార్మిక సంఘాల సమావేశంలో కేంద్రం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలపై చర్చించి పోరాట కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఏఐటీయూసీ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో పట్టణ మండల జిల్లా మహాసభలు జరపటానికి కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కన్వీనింగ్ కమిటీ సభ్యులు డి.లక్ష్మణమూర్తి, భజంత్రీ శ్రీనివాస్, చాట్ల పుల్లారావు, తొర్లపాటి బాబు, పుప్పాల కన్నబాబు, ఐతా సురేష్ పాల్గొన్నారు.

వైభవంగా శోభాయాత్ర



నగరంలో నిర్వహిస్తున్న శోభాయాత్ర

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా నగరానికి చెందిన మహదేవ్ జాదవ్ మరాఠీ సమాజ్ ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాజ్ అధ్యక్షుడు ఆనందరావ్ జగ్దాలే మాట్లాడుతూ పరాయి పాలకుల నుంచి దేశ ప్రజలను, హిందూ దేవాలయాలను కాపాడి అఖండ హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి కుల, మత, జాతి వివక్ష చూపకుండా రాజ్యపాలన చేసిన హిందూ రాజు శివాజీ అని కొనియాడారు. తొలుత ఈ శోభాయాత్ర స్థానిక 12 పంపుల సెంటర్ నుంచి బయలుదేరి పవర్ పేట స్టేషన్ మీదుగా ఆర్‌ఆర్‌పేట, విజయవిహార్ సెంటర్, పత్తేబాద నాలుగు గుళ్ల సెంటర్‌కు చేరుకుంది. శోభాయాత్ర సందర్భంగా మరాఠీ సమాజ్ సభ్యులు, వీహెచ్‌పీ సభ్యులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో మరాఠీ సమాజ్ గౌరవ అధ్యక్షుడు ప్రశాంత్ భోస్లే, ఆర్‌ఎస్‌ఎస్ కార్యదర్శి రుద్రరాజు చైతన్య, వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	24	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	14	చిక్కుడు కాయలు	20
వంకాయలు (కాంతులు)	20	చామదుంపలు	54
వంకాయలు (తెలుపు)	20	ములక్కాడలు	12-15
బెండకాయలు	40	కంద	44
పచ్చిమిర్చి	20	బీట్‌రూట్	28
కాకర కాయలు	20-28	కీరా దోస	30
బీరకాయలు	40	ఫ్రెంచ్‌బీన్స్	70
బీరకాయలు (పందిరి)	50	అల్లం	70
క్యాబేజీ	16	కొత్తిమీర (కట్ట)	15
క్యారెట్	24	పాలకూర	09
దొండకాయలు	28	చుక్కకూర	09
బంగాళదుంపలు	20	తోటకూర	09
ఉల్లిపాయలు	20	గోంగూర	08
గోరుచిక్కుడు	36	పుదీనా	05
దోసకాయలు	32-40	బఠాణీ	--
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	54
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	24

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	30
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	37

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	29
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.15	34820	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	09.00	4794	32
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -విశాఖపట్నం	22.00	4838	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	33

పుస్తకమే ఉన్నతికి సోపానం

భీమడోలు: భీమడోలు, పూళ్ల, శాఖా గ్రంథాలయాల్లో చదవడం మా కిష్టం కార్యక్రమం ఆదివారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొని ఎంపిక చేసుకున్న పుస్తకాలను చదివారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాలను డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధినేత బాలనాగు విజయసారధి, శ్రీధర విజయకృష్ణ చక్కని ప్రోత్సాహాన్ని అందిస్తున్నారు. తొలుత ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మండే సుధాకర్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉన్నత స్థితికి చేరుకునేందుకు పుస్తక పఠనమే చక్కని సోపానమన్నారు. పలు స్ఫూర్తిదాయక కథలను చిన్నారులకు వివరించారు.

కొండలరావుకు ఉత్తమ రైతు అవార్డు

దెందులూరు: దెందులూరు మండలంలో రామారావుగూడెం గ్రామానికి చెందిన పట్టుపరిశ్రమ సాగు చేసే రైతు కాళి కొండలరావుకు ఉత్తమ రైతు అవార్డుకు ఎంపికయ్యారని ఆ శాఖ దెందులూరు మండల టెక్నికల్ అసిస్టెంట్ టీ.రత్తయ్య తెలిపారు. సేంద్రియ, వ్యవసాయ పద్ధతుల ద్వారా తక్కువ ఖర్చుతో పట్టు పరిశ్రమ నిర్వహిస్తూ అధిక దిగుబడి సాధిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలిచిన కొండలరావును జిల్లా అధికారులు ఉత్తమ రైతుకుగా ఎంపిక చేశారన్నారు. కొండలరావు ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ద్వారా రెండెకరాల్లో పట్టు పరిశ్రమ నిర్వహిస్తున్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

భీమడోలు: రైతుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న జరగనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. పూళ్లలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం మండల రైతు సంఘం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమంలో లక్షలాది మంది రైతులతో కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి కట్టా భాస్కరరావు, రైతు సంఘం నాయకులు వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, జి.కృష్ణబాలాజీ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకుంటాం



ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గండికోట శ్రీనును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

భీమడోలు: కురెళ్లగూడెం గ్రామానికి చెందిన మృతుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. జాతీయ రహదారి పూళ్ల వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కురెళ్లగూడెంకు చెందిన కూలీలు దండ్రు వీరాస్వామి, కర్నాటి మహేంద్ర, ఊటుకూరి ఫణీంద్ర మృతి చెందిన విషయం విదితమే. తీవ్ర గాయాలతో గండికోట శ్రీను ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న మూడు మృతదేహాలను ఆయన పరిశీలించారు. మృత దేహాలకు వెంటనే పోస్ట్‌మార్టమ్ చేసి కుటుంబ సభ్యులు అప్పగించాలని సంబంధిత ఆసుపత్రి సూపరిండెంటెంట్‌తో ఎమ్మెల్యే వాసుబాబు ఫోన్‌లో మాట్లాడి ఆ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయించారు. మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ఓదార్చారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గండికోట శ్రీనును పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ప్రభుత్వ పరంగా రావాల్సిన వైఎస్సార్ బీమా నగదు త్వరితగతిన అందేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చిన హామీలు అమలయ్యేలా ప్రయత్నం చేస్తానని వివరించారు. రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను చీకట్లోకి నెట్టేస్తున్నారని, ఎంత జాగ్రత్తగా ప్రయాణిస్తున్నా ప్రమాదాలు జరగడం చాలా బాధాకరమన్నారు. మృతుల ఆత్మకు శాంతి చేకూరాలని తన ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసారు. అనంతరం మృతదేహాలను కురెళ్లగూడెంకు తరలించగా అక్కడ అంత్యక్రియలు నిర్వహించారు. వారి కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. మృతులు ముగ్గురు నిత్యం కూలి పనులకు వెళ్లే తరుణంలో అప్యాయతానురాగాలతో ఉండే వారని, వారిని రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేసారు. కర్నాటి మహేంద్ర, ఊటుకూరి ఫణీంద్ర, వీరాస్వామి వారి కుటుంబ సభ్యులు గుండెవిసేలా రోధించారు. ఈ కార్యక్రమాల్లో సీఐ వి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ షంషూద్దీన్, సర్పంచ్ గుడివాడ నాగగౌతమి సీతారామాంజనేయులు, పెద్దలు రావిపాటి గాంధీ, గన్ని గోపాలరావు, నీలపాల గంగాధరరావు, కె.గోపాలస్వామి, పి.అయ్యప్ప, వీఆర్వోలు ఇంతియాప్, మార్కేండేయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు ఉత్సవం



రహంతుల్లా మహాత్ముని దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న కమిటీ ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక తంగెళ్ళమూడి రాణి నగర్‌లోని హజరత్ నజీముల్లాషా హజారీ రహంతుల్లా మహాత్ముని ఉరుసు కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉరుసు సందర్భంగా ఆదివారం ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. సాయంత్రం దర్గాకు విద్యుద్దీపాలంకరణ చేసి ఫాతెహా ఖానీ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం దువా ప్రార్థనలు చేశారు. ఈ ఉరుసు కార్యక్రమంలో నగరంలోని హిందూ ముస్లింలు కులమతాలకు అతీతంగా పాల్గొని మహాత్ముని సేవించారు. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు. ఈ ప్రార్థనల్లో కమిటీ సభ్యులు ఎండీ షౌకత్, ఎండీ నవాజ్, ఎండీ నజీర్, ఇతర మత పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్షుడు ఎండీ ఆదిల్, కార్యదర్శి ఎండీ అక్రమ్ పర్యవేక్షించారు.